Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 358 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

ఆదివారం, 15 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

## సైప్రస్, కెనడా, క్రొయేషియాలో మోదీ పర్యటన



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారంనాడు మూడు దేశాల పర్యటనకు వెళ్తున్నారు. ఈనెల 15-16 తేదీల్లో సైప్రస్‌లో పర్యటిస్తారు. 16-17 తేదీల్లో కెనడాలోని జీ-7 సదస్సులో పాల్గొంటారు. 18న క్రొయేషియాలో పర్యటిస్తారు. కేంద్ర విదేశాంగ శాఖ శనివారంనాడు ఈ వివరాలను వెల్లడించింది. ఎంఈఏ వివరాల ప్రకారం, సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ఆహ్వానం మేరకు ప్రధానమంత్రి మోదీ ఈనెల 15-16 తేదీల్లో ఆ దేశంలో అధికారిక పర్యటన జరుపుతారు. రెండు దశాబ్దాలుగా ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే ప్రథమం. అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్‌తో చర్చల అనంతరం లిమాసోల్‌లో వ్యాపార దిగ్గజాలను ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తారు. రెండు దేశాల మధ్య దౌపాక్షిక సంబంధాల పటిష్టతకు మోదీ పర్యటన దోహదం కానుంది. అనంతరం కెనడాకు మోదీ బయలుదేరి వెళ్తారు. కెనడా ప్రధాని మార్క్ కార్నే ఆహ్వానం మేరకు జూన్ 16-17 తేదీల్లో జరిగే జీ-7 సదస్సులో మోదీ పాల్గొంటారు. జీ-7 సదస్సులో మోదీ పాల్గొనడం వరుసగా ఇది ఆరోసారి. సదస్సు సందర్భంగా పలు ద్వైపాక్షిక సమావేశాల్లోనూ ప్రధాని పాల్గొంటారు. ప్రధాని తన పర్యటన చివర్లో క్రొయేషియాలో పర్యటిస్తారు. క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెంకోవిక్ ఆహ్వానం మేరకు జూన్ 18న ఆ దేశంలో అధికారిక పర్యటన జరుపుతారు. క్రొయేషియాలో భారతదేశ ప్రధానమంత్రి ఒకరు పర్యటించనుండటం ఇదే మొదటిసారి. ద్వైపాక్షిక సంబంధాల్లో ప్రధాని పర్యటన ఒక మైలురాయి కానుంది. ప్రధాని ప్లెంకోవిక్, అధ్యక్షుడు జోరన్ మిలనోవిక్‌తో మోదీ సమావేశమవుతారు. యూరోపియన్ యూనియన్ భాగస్వాములతో మరింత పటిష్ట బంధాల గురించి చర్చిస్తారు.

## జగన్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడిదారులు పారిపోయారు

### - మంత్రి కొలుసు పార్థసారథి




**అమరావతి, (రాజధాని వార్తలు):** గత జగన్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి దారులు ఏపీ నుంచి పారిపోయారని మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. విద్యావిధానం పటిష్ట పరిచేం దుకు విద్యార్థులకు స్కిల్ డెవలప్ చేస్తున్నామని అన్నారు. స్త్రీ శక్తి ద్వారా మహిళల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని అన్నారు. మహి ళలను అవమానపరిచేలా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని ధ్వజ మెత్తారు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో చాలామంది వైసీపీ నేతల కు బెయిల్ దొరకటం లేదని చెప్పారు. ఇవాళ(శనివారం) అమరా వతిలో మంత్రి కొలుసు పార్థసారథి మీడియాతో మాట్లాడారు. కేవలం ఓ వ్యక్తికి బెయిల్ దొరికితేనే అంతా బాగున్నట్లుగా వైసీపీ నేతలు ప్రవర్తించటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. కూటమి సర్కార్ ఏడాది పాలనలో తమకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను ఏడాది పాలనలో అమలు చేశామని ఉద్ఘాటించారు మంత్రి కొలుసు పార్థసారథి. అమలు చేయలేదని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. తల్లికి వందనంలో భాగంగా ఎంతమంది పిల్లలు ఉన్నా పథకం అమలు చేశామని తెలిపారు. వైసీపీ అమ్మబడికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిందని.. పిల్లలందరికీ ఇస్తామని చెప్పి ఒక్కరికే ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రతిపక్షం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీకి రాని ప్రతిపక్ష పార్టీ దేశంలో కేవలం వైసీపీనేనని విమర్శలు చేశారు. తల్లికి వందనంలో రూ. 2 వేలు మంత్రి నారా లోకేష్ జేబులో వేసుకుంటున్నారని వైసీపీ నేతలు అన్నారని.. ఈ విషయంలో లోకేష్ సవాల్‌కి సిద్ధమా అంటే వారు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. రూ. 34 వేల కోట్లు ఏడాదిలో పెన్షన్ కిందా ఇచ్చామని చెప్పారు. వైసీపీ హయాంలో ఏ పథకాలు ఇచ్చారో తెలుసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి రూ. 1.04లు ఇచ్చామని గుర్తుచేశారు. జగన్ హయాంలో కేవలం రూ.64 వేలు మాత్రమే ఇచ్చారని.. పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించారా అని మంత్రి పార్థసారథి ప్రశ్నించారు.

**సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశాం...**

'కూటమి పాలనలో తల్లికి వందనం, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇస్తు న్నాం. మా ప్రభుత్వంలో పిల్లలను చదివించి, వాళ్లకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నాం. మేము సామాన్యులను ఎక్కడా కేసులు పెట్టి వేధించలేదు. గత వైసీపీ ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో పని చేసింది. కూటమి పాలనలో 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. పిల్లలకు మంచి భవిష్యత్ ఇస్తాం. ఆ రెండు వేల రూపాయలను పాఠశాలలకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం ఖర్చు చేస్తాం. అశోక్ లేలాండ్, అమర్ రాజా లాంటి సంస్థలు ఏపీ నుంచి వెళ్లిపోయాయి. గత జగన్ ప్రభుత్వంలో చేసిన రూ.10 లక్షల కోట్ల అప్పులకు.. మా ప్రభుత్వంలో వడ్డీలకే వేల కోట్లు చెల్లిస్తున్నాం. పోలవరాన్ని ధ్వంసం చేశారు. అమరావతి రాజధాని అని మూడు రాజధానులని చట్టం చేసిందే వైసీపీ. పోలవరం ప్రాజెక్టు 2027 లోగా పూర్తి చేస్తాం. 87 లక్షల మంది ఉంటే 45 లక్షల మందికే ఎందుకు అమ్మవడి ఇచ్చారు' అని మంత్రి కొలుసు పార్థసారథి ప్రశ్నించారు.

## యోగాంధ్రను విజయవంతం చేయండి.. రఘురామ పిలుపు

**పశ్చిమగోదావరి, (రాజధాని వార్తలు):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల పాటు యోగాంధ్ర పేరుతో మాసోత్సవాలను నిర్వహిస్తోంది ప్రభుత్వం. ఇందులో భాగంగా ప్రతీ జిల్లాలో ప్రజలు రోజూ యోగాసనాలు వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్న యోగాంధ్రలో రాజకీయ నాయకులు, అధికారులు, పోలీసులు కూడా పాల్గొని యోగాసనాలు చేస్తున్నారు. ఇప్పుడు తాజాగా ఈరోజు (శనివారం) పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు పాల్గొన్నారు. జిల్లాలోని కాళ్ల మండలం పెదఅమిరంలో యోగాంధ్ర 2025 కార్యక్రమం నిర్వహించారు. యోగా కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా రఘురామ మాట్లడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే యోగాంధ్ర కార్యక్రమం ఏపీ రాష్ట్రంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద ఎత్తున నెలరోజుల పాటు యోగా శిక్షణ నిర్వహిస్తున్నారన్నారు. ఈనెల 21న వైజాగ్ సముద్రం ఒడ్డున ప్రపంచ స్థాయిలోనే నిలిచిపోయేలాగా ప్రణాళిక చేస్తున్నారని తెలిపారు. రెండు కోట్ల మంది యోగాకు రిజిస్టర్ అవుతారు అనుకుంటే, రెండు కోట్ల 20 లక్షల మంది రిజిస్టర్ అయ్యారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 8,50,000 మంది యోగా రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు. భారతదేశంలోనే యోగా అంటే ఆంధ్రప్రదేశ్ గుర్తొచ్చేలాగా యోగాంధ్ర 2025ని విజయవంతం చేయాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు పిలుపునిచ్చారు. ఈ యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొని యోగాసనాలు వేశారు. ఇక ఈనెల జూన్ 21న విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ యోగా డేలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. విశాఖలో జరిగే యోగా దినోత్సవ వివరాలను ఇప్పటికే కేంద్ర ఆయూష్ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ వెల్లడించారు. 45 నిమిషాల పాటు యోగా కార్యక్రమం ఉంటుందని.. ప్రధాని మోదీ ప్రసంగం తర్వాత కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు. యోగా కార్యక్రమ ఏర్పాట్లను స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరిగే యోగా కార్యక్రమాలు లైవ్ ప్రసారం జరుగుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

## ఏపీ సీఎం చంద్రబాబుతో తెలుగు సినీ పరిశ్రమ ప్రముఖుల కీలక భేటీ




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో తెలుగు సినీ పరిశ్రమ ప్రముఖులు రేపు (ఆదివారం) సాయంత్రం 4 గంటలకు కలవనున్నారు. ఈ సమావేశంలో తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. మొదట ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ని కలిసి మాట్లాడుతారు. ఆ తర్వాత పవన్‌తో పాటు చంద్రబాబు నివాసానికి సినీ పెద్దలు వెళ్లనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారైనా సీఎం చంద్రబాబుని కలిశారా అని సినీ ప్రముఖులను ఇటీవల పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. థియేటర్‌ల బంద్ అంశానికి సంబంధించి పవన్ కల్యాణ్ సీరియస్ అయ్యారు. ఏపీలో థియేటర్‌ల పరిస్థితి.. సదు పాయాలకు సంబంధించి డీటెయిల్ రిపోర్ట్ ఇవ్వాలని సినిమాటోగ్రఫీ శాఖ ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు రంగంలోకి దిగి పలు థియేటర్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను సినీ ప్రముఖులు కలవనున్నారు. రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లయినా ఏపీలో అంతంత మాత్రంగానే సినీ ఇండస్ట్రీ ప్రభావం ఉంటుంది. కనీసం సింగిల్ షెడ్యూల్ సినిమా కూడా ఏపీలో తీయలేని పరిస్థితి ఉండటంతో ఈ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వం ఏం చెబుతుంది, సినీ ప్రముఖులు ఏమి కోరతారనే అంశంపై ఈ సమావేశంలో చర్చలు జరుగనున్నాయి. చంద్రబాబు సూచన మేరకు సినీ ప్రముఖు లకు మంత్రి కందుల దుర్గేష్ ఫోన్ చేసి ఆహ్వానం పలికారు. ఈ భేటీకి మొత్తం 35 నుంచి 40 మంది సినీ ప్రముఖులు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సమావేశం అనంతరం ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా భేటీ కానున్నారు.

## గుడ్ న్యూస్.. ఆధార్ అప్‌డేట్ గడువు పొడిగింపు

**న్యూఢిల్లీ:** ఆధార్ అప్‌డేట్ చేసుకునే వారికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) గుడ్ న్యూస్ చెప్పింది. ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ఇచ్చిన గడువును మరోసారి పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. సంబంధిత డాక్యుమెంట్లను ఉచితంగా అప్‌లోడ్ చేసుకునేందుకు ఇచ్చిన గడువు జూన్ 14వ తేదీతో.. అంటే నేటితో ముగియనుంది. అలాంటి వేళ ఉడాయ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎక్స్ ఖాతా వేదికగా శనివారం వెల్లడించింది. ఈ నిర్ణయం వల్ల లక్షలాది మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతోందని స్పష్టం చేసింది. మై ఆధార్ పోర్టల్ ద్వారా ఉచితంగా ఈ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసుకోవచ్చు. ఆధార్ డేటాబేస్‌లో ప్రస్తుతం.. కచ్చితమైన సమాచారాన్ని ఉంచేందుకు ఆధార్ హోల్డర్లకు ఉడాయ్ ఈ అవకాశం కల్పిస్తోంది. గుర్తింపు పొందిన ఆధారాలు, చిరునామాకు సంబంధించిన పత్రాలను ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు అనుమతిస్తోంది. వివాహం కావడం.. ఉన్నత చదువులు, తదితర కారణాల వల్ల కొందరు వేర్వేరు ప్రదేశాలకు మారుతూంటారు. అలాంటి వారికి ఇది ఉపయుక్తంగా ఉండనుంది. మరోవైపు ఆధార్ తీసుకుని పదేళ్లు పూర్తయ్యి ఉంటుందో వారు కూడా తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని గతంలో ఉడయ్ సూచించిన సంగతి తెలిసిందే.

## పొదిలి దాడి కేసులో మరో 15 మంది అరెస్ట్




**ప్రకాశం, (రాజధాని వార్తలు):** పొదిలి దాడి కేసులో మరో 15 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇటీవల పొదిలిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనకు వెళ్లినప్పుడు వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. ఏపీ మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళన చేస్తున్న మహిళలపై వైసీపీ మూకలు దాడి చేశాయి. మహిళలు, పోలీసులపై రాళ్లు విసిరారు. ఈ ఘటనలో ముగ్గురు పోలీసులు, ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. ఈ కేసులో ఇప్పటికే తొమ్మిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీస్ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలు ఆధారంగా నిందితులను గుర్తిస్తున్నారు. జగన్ పర్యటనలో నిబంధనలను ఉల్లంఘించారంటూ వైసీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డికి ఇప్పటికే పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 11న పొదిలి పొగాకు వేలం కేంద్రానికి వైఎస్ జగన్ వచ్చారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున వైసీపీ కార్యకర్తలు తరలి వచ్చారు. అదే సమయంలో సాక్షి ఛానల్ డిబేట్‌లో అమరావతి మహిళలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానికంగా ఉన్న మహిళలు జగన్‌కు వ్యతిరేకంగా నల్ల బెలూన్లు, ప్లకార్డు ప్రదర్శించారు. దీన్ని జీర్ణించుకోలేని వైసీపీ మూకలు.. నిరసన తెలుపుతున్న మహిళలపై రాళ్లు, చెప్పులతో దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురు మహిళలతోపాటు ముగ్గురు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. దీంతోపాటు దర్శి డీఎస్పీ లక్ష్మీనారా యణ తలపై ర్యాలీగా వెళ్తున్న వైసీపీ కార్యకర్తలు నేరుగా గురి చూసి చెప్పులతో దాడి చేసిన దృశ్యాలు పోలీస్ కెమరాల్లో రికార్డు అయ్యాయి. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న సీఎం చంద్ర బాబు.. చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నిందితులను గుర్తించే పనిలో పడ్డారు పోలీసులు. ఈ నెల 12న తొమ్మిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న మహిళలతోపాటు పోలీసులపై దాడి చేసిన వారి ముఖాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పోలీసులు అరెస్ట్‌లు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఈరోజు మరో 15 మందిని అరెస్ట్ చేశారు. వీరందరినీ పొదిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం పొదిలి కోర్టులో 15 మంది నిందితులను హాజరు పర్చే అవకాశం ఉంది. అంతేకాకుండా మరి కొంతమంది నిందితులను గుర్తించిన పోలీసులు వారి కోసమూ గాలింపు చర్యలు చేపట్టారు.

## కూర్మ గ్రామంలో అగ్నిప్రమాదం దురదృష్టకరం: పవన్




**అమరావతి, (రాజధాని వార్తలు):** శ్రీకాకుళం జిల్లా కూర్మ గ్రామంలో అగ్నిప్రమాద ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ఆధునిక హంగులు లేకుండా ఆధ్యాత్మిక చింతనతో జీవించేలా తీర్చిదిద్దుకున్న కూర్మ గ్రామం అగ్నికి ఆహుతి కావడం దురదృష్టకరమన్నారు. అగ్నిప్రమాదంపై పోలీసులు లోతుగా విచారణ చేయాలని సంబంధిత యంత్రాంగానికి సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. కూర్మ గ్రామంలో ప్రస్తుత పరిస్థితిపై జిల్లా అధికారులతో మాట్లాడి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సనాతన ధార్మిక జీవనం కోసం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ గ్రామం ఏర్పాటైందని తెలిపారు. కూర్మ గ్రామవాసులు యాంత్రిక జీవన విధానాలకు భిన్నంగా మట్టి ఇళ్లల్లో ఉంటూ ప్రకృతి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. వేద విద్యను అభ్యసించే చిన్నారులు సంస్కృతం, తెలుగు, హిందీ, ఆంగ్లం అనర్గళంగా మాట్లాడుతూ ఉంటారని అన్నారు. వర్తమాన కాలంలో విశిష్టంగా ఉన్న ఈ గ్రామం పునరుద్ధరణపై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఇటీవల కూర్మ గ్రామంలోని ఆధ్మాత్మిక ప్రసంగాలు చేసే రాధాకృష్ణ మందిరంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో భక్తులు భయంతో పరుగులు తీశారు. ఈ ఘటనలో విలువైన గ్రంథాలు, పుస్తకాలు అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు రూ.50 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచనా. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం రంగంలోకి దిగి పలు ఆధారాలను సేకరించాయి. గతంలోనూ దుండగులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని నిర్వాహకులు తెలిపారు.

# దళితులు రోడ్డుపై నడిస్తే మైల పడుతుందట

**- కులం పేరుతో దూషణలు - పసుపు నీళ్లతో శుద్ధి - మంగళగిరి కుప్పురావు కాలనీలో దారుణం - మంగళగిరి డిఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన దళిత సంఘాలు**

**మంగళగిరి, (రాజధాని వార్తలు):** కాలం వేగంగా మారిన... కాలంతో పాటు సామాజిక పరిస్థితులు సమూలంగా మారుతున్న... కొందరు మతోన్మాదులు గజ్జి కుక్కలు తమ వక్రబుద్ధని చాటుకుంటూ మను సిద్ధాంతాలను అమలు చేసేందుకు సిగ్గు శరం లేకుండా ముందుకు సాగుతున్నారు. సామాజిక రాజకీయ చైతన్యానికి మారు పేరైన మంగళగిరిలో ఇలాంటి అమానవీయమైన సంఘటన ఇది. రాకెట్ యుగంలో కూడా దళితులు రోడ్డుపై నడిస్తే మైల పేరుతో పసుపు నీళ్లు చల్లటంతో పాటు కులం పేరుతో దూషిస్తూ, వేధిస్తున్న ఘటన ఆలస్యంగా మంగళగిరిలో వెలుగులోకి వచ్చింది. కాలం మారిన కులతత్వ మనిషి ఆలోచనలో మార్పు రాలేదు. ఏదో ఆవేశం, కోపంలో నోరు జారిందిలే అనుకుని సర్దుకున్నా, పార్టీ నాయకులు, పెద్దలు రాజీ ధోరణీలో వ్యవహరించినా, కులం తక్కువది తగ్గకుండా ఏమి చేస్తుంది అంటూ దూషణలు..



భరించలేని భాధితురాలు శుక్రవారం స్దానికులు సహకారంతో దళిత మహిళ, సాక్షులు, దళిత సంఘాల నాయకులు మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ డిఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. గత నెల 25వ తేదీన బాధితురాలు మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, డిఎస్పీ సిహెచ్ మురళీకృష్ణ విచారణ చేపట్టారు. విచారణ నత్తనడకన సాగటంతో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ఫిర్యాదు చేసిన అమెకు వేధింపులు తగ్గకపోగా పెరగటంతో ఆందోళన బాట పట్టారు. మహిళ భర్త కేంద్ర పాలక ప్రభుత్వ పార్టీ మంగళగిరి పట్టణ అధ్యక్షుడు కావటంతో కేసు నమోదు కాకపోగా బాధితురాలికి అమె నుండి మరింత వేధింపులు ఎక్కువ అయ్యాయి. ఆమె సామాజిక వర్గానికి చెందినవారే ఆమె తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్దానిక సాక్షుల సమాచారం మేరకు మంగళగిరి కుప్పురావు కాలనీకి 11వ లైన్ పద్మశాలీయ బజార్‌లో దళితులైన పగడపొగు రాధా, వెంకటేశ్వరరావులు 25 ఏళ్ల క్రితం స్దలం కొని ఇల్లు కట్టుకుని నివాసిస్తున్నారు. ఇరుగు పొరుగు వారితో కలసి మెలసి జీవిస్తున్నారు. రాధా ఇంటి ఎదురుగా గత కొంతకాలం నుండి మునగాల ప్రీతి నాగేశ్వరరావులు ఎదురుగా ఉన్న దళితురాలైన రాధా, వారి మనవళ్లను కులం పేరుతో దూషించటంతో పాటు చాలా నీచంగా మాట్లాడుతుందని బాధితురాలు రాధా ఆవేదన వ్యక్తం చేసింది. చిన్న పిల్లలు ఆమె ఇంటి వైపుకు వెళ్లితే మైల పేరుతో పసుపు నీళ్లు చల్లుతుందని బాధితురాలు రాధా, స్దానికులు లక్ష్మీ, శ్రీదేవి, బొడ్డు రామచంద్ర రావు మహిళలు తెలిపారు. ఎంఆర్పీఎస్ దళిత నాయకులు చందోలు విక్టర్ పాల్, కలకొటి నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కంతేటి సాగర్ కులం పేరుతో దూషించిన మహిళపై కేసు నమోదు చేసి వెంటనే ఆరెస్ట్ చేయాలని డిఎస్పీ మురళీకృష్ణను డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణ సిఐ రవీంద్ర నాయక్ బాధితురాలి ఫిర్యాదు మేరకు మునగాల ప్రీతిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ కేసు నమోదు చేశారు. సమగ్ర విచారణ జరిపించి బాధితురాలు ఇచ్చిన ఆధారాలు సాక్షులు స్దానికులు స్టేట్‌మెంట్ ఆధారంగా కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని డిఎస్పీని దళిత సంఘాల నాయకులు కోరారు.

# సాన ప్రసాద్ రాయల్‌కి స్వాగతం పలికిన బలిజ సోదరులు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ఒంగోలుకు చెందిన బలిజ సోదరుడు సాన ప్రసాద్ రాయల్ బలిజ సంఘాన్ని బీసీలో చేర్చాల్సిందిగా చిత్తూరు నుండి అమరావతికి పాదయాత్ర చేస్తూ శుక్రవారం శ్రీకాళహస్తికి చేరుకున్నారు. ఈ పాదయాత్రకు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, శ్రీకాళహస్తి బలిజ నాయకులు స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. అనంతరం రాయల్ వారి గోపురం వద్ద ఉన్న శ్రీ కృష్ణ దేవరాయ విగ్రహంకి పూలమాల వేసి పాదయాత్రను మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి బలిజ నాయకులు ఉప్పు కృష్ణయ్య, పూల కృష్ణమూర్తి, స్వర్ణ మూర్తి, సిద్ధలు గారి ప్రసాద్, దండు రాఘవులు, శ్రీపురం సుధాకర్, నరసయ్య, అంజూరు వెంకటేష్ బాబు, ఉత్తరాది శరవణ కుమార్, సాధనమున్న రాయల్, బుల్లెట్ జయశ్యామ్, శ్రీవారి సురేష్, కంట ఉదయ్ కుమార్, పసుపులేటి నవీన్, మొగరాల గణేష్, చింతామణి పాండు, చిలకా గోపి, సొట్ట సుకుమార్, మైనంపాటి మస్తాన్, కండ్రిగ భాస్కర్, తేజు, గంగాధరం, కృష్ణ, వేలూరు రమేష్, మధుర సతీష్, సుబ్రహ్మణ్యం, సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# తనయాలిలో అనంతపురం వాసి ఆత్మహత్య



**దొరవారిసత్రం, (రాజధాని వార్తలు):** దొరవారిసత్రం మండలంలోని తనియాలి పంచాయతీనందు శుక్రవారం ఉదయం పంచాయితీ చెత్త సేకరణ షెడ్డునందు ఉరి వేసుకొని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గ్రామస్తులు కనుగొని, దొరవారిసత్రం పోలీస్ స్టేషన్కు సమాచారాన్ని అందించారు. సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బంది ఎస్సై అజయ్ కుమార్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన వ్యక్తిని పరిశీలించి అతను అనంతపురం జిల్లా, రాయదుర్గం తాలూకా, బ్రహ్మసముద్రం మండలం, గుండిగానిపల్లి గ్రామానికి చెందిన, అజ్జప్పగారి ఈశ్వరప్ప, వయసు 45 సంవత్సరాలుగా నిర్ధారించారు. ఎస్సై విచారణ మేరకు అతను మానసిక వ్యాధితో గత ఆరు సంవత్సరాల నుండి వివిధ హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ తీసుకుంటున్నాడని అతని బ్యాగ్‌లో ఉన్న డాక్టర్స్ బిల్స్ చూసి నిర్దారించారు. మరియు వాళ్ల కుటుంబ సభ్యులను విచారించగా అతను మతిస్థిమితం లేకుండా అప్పుడప్పుడు ఊరు వదిలి వెళ్ళిపోతుంటాడని, అతను రెండు రోజుల క్రితం డిఎస్సీ పరీక్ష రాయడానికని ఇంటి నుండి వెళ్ళాడని కుటుంబ సభ్యులు తెలియజేశారన్నారు. అతను మానసిక వ్యాధితో బాధపడుతూ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అజయ్ కుమార్ తెలియజేశారు.

# టీడీపీ పాలనలో కళామతల్లి ముద్దుబిడ్డలకు ప్రోత్సాహం

**కర్నూలు, (రాజధాని వార్తలు):** కర్నూలు నగరంలోని టీ.జీ కళా క్షేత్రంలో విద్యావేత్త, రచయిత, విశ్రాంత ప్రిన్సిపాల్, నాటక రంగస్థల నటుడు, రాయలసీమలో తెలుగు భాష, కళా సంస్కృతికి విశిష్ట సేవలందించిన కళామ తల్లి ముద్దు బిడ్డ, నంది అవార్డు గ్రహిత పత్తి ఓబులయ్య హంస పురస్కారం, కళారత్న బిరుదుతో పాటు ఇటీవల ప్రతిష్టాత్మకమైన ఎన్టీఆర్ జాతీయ రంగ స్థల పురస్కారం అవార్డు స్వీకరించడం జరిగింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రకాశం జిల్లా బెల్లంకొండ విద్యాసంస్థలు అధినేత డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు, ప్రొఫెసర్ బి.జయశంకర వర ప్రసాద్, విశ్రాంత అధ్యాపకులు బి.వి.మాధవరావు తదితరులు పత్తి ఓబులయ్యను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లాలోని బెల్లంకొండ విద్యాసంస్థల అధినేత, శ్రీలక్ష్మి మాధవ స్వామి దేవస్థానం చైర్మన్ డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు ప్రసంగిస్తూ అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం కళా, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక వివిధ సేవారంగంలో విశిష్ట సేవలు అందించిన, నిజమైన, అర్హులైన వారిని గుర్తించి ప్రతిష్టాత్మకమైన పురస్కారాలు, బిరుదులు ఇచ్చి సత్కరించడం సాంప్రదాయంగా జరుగుతుందని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం పత్తి ఓబులయ్యలాంటి వారిని గుర్తించి హంస పురస్కారంతో పాటు కళారత్న బిరుదు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అవార్డు, బిరుదులు పొందిన వారికి తగిన న్యాయం జరగడమే కాకుండా అవార్డులకు, బిరుదులకు




కూడా విలువ పెరిగిందని వక్తలు పేర్కొన్నారు. భవిష్యత్తులో పత్తి ఓబులయ్యలాంటి వ్యకికి ప్రతిష్టాత్మకమైన పద్మ అవార్డు కూడా రాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి మంచి వ్యక్తి ఆ సర్వేశ్వరుని దయతో నిండు నూరేళ్ళు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో పాటు శ్రీ లక్ష్మి మాధవ స్వామి వారి కృపాకటాక్షములు ఎల్లవేళలా ఉండాలని డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో ముద్రిక ప్రింటర్స్ అధినేత పోలూరు భాస్కర్, డిగ్రీ కాలేజీ లెక్చరర్ ఆకుల శ్రీనుబాబు, కొత్తపల్లి రెహబామ్ అబ్రహం, ఉపాధ్యాయులు బొర్రా చంద్రమోహన్‌లతో పాటు పలువురు విద్యావేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని పత్తి ఓబులయ్యకు ఘనమైన సన్మానంతోపాటు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

## - జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత అన్నారు. శుక్రవారం ఉదయం భారతీయ స్టేట్‌బ్యాంక్ 70వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా రెడ్‌క్రాస్ సౌజన్యంతో రంగనాయకులపేట భారతీయ స్టేట్‌బ్యాంకు రీజనల్ కార్యాలయ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ సుజాత హాజరై రక్తదాన ప్రాధాన్యతను వివరించారు. సమాజంలో రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. మనం చేసే రక్తదానం ఒక నిండు ప్రాణాన్ని నిలుపుతుందన్నారు. శారీరకంగా రక్తదానంతో అనేక ప్రయోజనాలున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ కూడా రక్తదానంపై అపోహలు వీడి స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ పి మురళీనాయక్ మాట్లాడుతూ సమాజ




సేవలో ఎస్‌బిఐ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మందికి పైగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

# డిజిటల్ ఎం సి పి ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలి

## - తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్




**తిరుపతి, (రాజధాని వార్తలు):** వార్షిక జీవనోపాధి ప్రణాళిక ప్రకారం డిజిటల్ ఎంసిపి ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా స్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశం చైర్మన్ హోదాలో జిల్లా కలెక్టర్, ఆర్బిఐ ఎల్డీఎం గిరిదర్, ఎల్డీఎం గుంటూరు రవి కుమార్, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ సామంచి శర్మ, వివిధ బ్యాంకు అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక జీవనోపాధి ప్రణాళిక ప్రకారం డిజిటల్ ఎంసిపి ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. విద్యా హబ్ అయినా తిరుపతి జిల్లాలో పలు విశ్వవిద్యాలయాలు ఉన్నాయని, విద్యకు సంబంధించిన రుణాల విషయంలో ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. పి ఎం ఈ జి పి పథకం రుణాలు మంజూరైన యూనిట్లు అన్ని గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని ప్రైవేటు బ్యాంకులు రుణాల మంజూరు విషయంలో వెనకబడి ఉన్నాయని ఎలాంటి జాప్యం చేయకుండా రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకర్లందరూ రుణాల మంజూరులో నిర్దేశించబడిన లక్ష్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. జిల్లాలో వర్షాలు అధికంగా పడే అవకాశం ఉన్నందువలన క్రాప్ లోన్ సంబంధించిన రుణాల విషయంలో బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కౌలు రైతు కార్డుదారులకు క్రాప్ లోన్‌కి సంబంధించిన రుణాలను బ్యాంకర్లు సకాలంలో మంజూరు చేయాలని తెలిపారు. జిల్లాలో ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ ఆర్.బి.ఐ ఎల్డీఎం గిరిధర్, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ సామంచి శర్మతో కలిసి అనువల్ క్రెడిట్ ప్లాన్ తిరుపతి 2025-26 సంబంధించిన బుక్ రిలీజ్ చేశారు. ఈ సమావేశంలో నాబార్డ్ డి.డి.ఎం సునీల్, డిఆర్డిఏ పిడి శోభన్ బాబు, మెప్మా పీడీ రవీంద్ర, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలు



**చిల్లకూరు, (రాజధాని వార్తలు):** చిల్లకూరు మండలంలోని పాలిచర్ల వారిపాలెం ఉన్నత పాఠశాలలో పదో తరగతినందు ప్రతిభ చూపిన జి నవ్య 535 మార్కులు, టి తన్వి 529 మార్కులు, బి లోహిత్ 525 మార్కులు సాధించి పిసి వి పాలెం ఉన్నత పాఠశాల నందు ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచారు. పాలిచర్ల వారి పాలెం గ్రామానికి నెలబల్లి రామచంద్రారెడ్డి మాజీ ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ విద్యార్థుల ప్రతిభ గుర్తించి ప్రథమ స్థానంలో నిలిచిన నవ్యశ్రీకు 5000 రూపాయలు, తన్వికి 3000 రూపాయలు, లోహిత్‌కు 2000 రూపాయలు నగదు పురస్కారాన్ని పంపించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి అనసూయ మాట్లాడుతూ రామచంద్ర రెడ్డి లండన్‌లో ఉన్న పదవ తరగతి విద్యార్థులు ప్రతిభను గుర్తించి నగదు పురస్కారం అందజేయడం ఎంతో అభినందించదగ్గ విషయమని, వారు పాఠశాలకు చేసిన సేవలు కూడా కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్ఎంసి చైర్మన్ ఎస్కే షకీలా మాట్లాడుతూ రామచంద్ర రెడ్డి పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ కూడా అందజేశారని, ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ చంద్రశేఖర్, జి మాధవయ్య, దేశిరెడ్డి ప్రజేంద్ర రెడ్డి, విద్యుల్లత, మధుసూదన్ రావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శ్రీ మహాలక్ష్మమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మనుబోలు మండలం కాగి తాలపూరులో శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ అంకమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, శృతిరెడ్డి. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించిన రాజగోపాల్ రెడ్డి దంపతులు. సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో ఇంటింటికీ వెళ్లే కార్యక్రమం చేపట్టాము అన్నారు. గడప గడపకు వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నాము ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో ప్రతి సమస్య పరిష్కరిస్తాము. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో వ్యవస్థలన్నింటిని గాడిలో పెడుతూ సుపరిపాలన అందిస్తోంది అని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలు చేస్తోంది. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్‌గా రూ.4 వేలు అందిస్తున్నారు. దీపం పథకం కింద మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తున్నారు. నిన్ననే తల్లికి వందనం కార్యక్రమం ప్రారంభమైంది. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం లబ్ధి చేకూరుతోంది. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ పథకం అమలులోకి రాబోతోంది. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం అమలులోకి రానుంది అన్నారు.

# వైభవంగా శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు పట్టణంలోని రాజా వీధిలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు సూర్యప్రభ వాహనంలో భక్తులకు దర్శనమిచ్చారు. మాడ వీధి ఉత్సవం జరిగింది. అనంతరం ఆలయ ద్వారం వద్ద స్వామి అమ్మవార్లను నిలిపి లక్ష్మీ సంవాదం ముసుగుల సేవ నిర్వహించారు స్వామి వారిపై అమ్మవారు అనుమానంతో వైకుంఠానికి రానివ్వకుండా అడ్డుపడి సంవాదం గురించి అర్చకులు తెలియజేశారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# దుల్కర్ సల్మాన్ నిజంగా లక్కీయెస్ట్ ఫెల్లోనే!



దుల్కర్ సల్మాన్ ఓ మలయాళ హీరో. కానీ దక్షిణాది భాషలతో పాటు ఉత్తరాది ప్రేక్షకుల్ని కూడా ఆకట్టుకుంటూ తన ప్రత్యేకతను చాటుకున్నాడు. హీరోగా విలక్షణమైన కథలని ఎంచుకుంటూ మాతృ భాషకు మించి ఇతర భాషల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటూ భారీ ఫ్యాన్ బేస్‌ని ఏర్పాటు చేసుకున్నాడు. తెలుగులో వరుసగా సినిమాలు చేస్తూ అందరిని ఆశ్చర్య పరుస్తున్న దుల్కర్ సల్మాన్ ఇటీవల తెలుగులో నటించిన లక్కీ భాస్కర్‌తో భారీ బ్లాక్ బస్టర్‌ని దక్కించుకుని హీరోగా మరో మెట్టు ఎక్కిన విషయం తెలిసిందే. లక్కీ భాస్కర్ తరువాత తెలుగు, మలయాళ భాషల్లో మూడు సినిమాలు చేస్తున్నాడు దుల్కర్. కాంత, ఆకాశంలో ఒక తారతో పాటు మలయాళంలో ఐయామ్ గేమ్ చేస్తున్నాడు. దీనికి తనే నిర్మాత కూడా. ప్రస్తుతం మూడుసినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్న దుల్కర్ సల్మాన్‌ని అంతా లక్కీయెస్ట్ ఫెల్లో అంటున్నారు. దీంతో దుల్కర్ మరోసారి వార్తల్లో నిలుస్తున్నాడు. దుల్కర్‌ని లక్కీయెస్ట్ ఫెల్లో అని అంతా పిలుస్తుండటానికి బలమైన కారహే ఉంది. ఇటీవల దుల్కర్‌కు రెండు భారీ ఆఫర్లు వచ్చాయి. ఒకటి కమల్ హాసన్, శంకర్‌ల కలయికలో వచ్చిన ఇండియన్ 2. ఇందులో సిద్ధార్థ్ పోషించిన పాత్ర కోసం ముందు శంకర్ ..దుల్కర్‌ని సంప్రదించారట. ఆ క్యారెక్ట్ చేయడం ఇష్టం లేని దుల్కర్ దర్శకుడు శంకర్ ఇచ్చిన ఆఫర్‌ని సున్నితంగా తిరస్కరించాడట.

ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్ట్‌గా నిలిచి శంకర్‌కు, కమల్‌కు షాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ తరువాత మరో ఆఫర్ దుల్కర్ తలుపు తట్టింది. అది కూడా కమల్ సినిమానే. మణిరత్నం, కమల్ కలిసి కొన్నేళ్ల విరామం తరువాత చేసిన మూవీ థగ్ లైఫ్. ఇందులో శింబు కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఈ పాత్రని ముందు దుల్కర్‌కు ఆఫర్ చేశారట. అయితే మణిరత్నం ఇచ్చిన ఆఫర్‌ని దుల్కర్ సున్నితంగా తిరస్కరించి ఈ ప్రాజెక్ట్ చేయలేనని చెప్పాడట. ఆ తరువాతే ఆ క్యారెక్టర్‌ని మణిరత్నం హీరో శింబుతో చేయించారు. రీసెంట్‌గా విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్‌గా నిలిచి షాక్ ఇచ్చింది. ఇలా రెండు సార్లు తెలివిగా దుల్కర్ డిజాస్టర్ల నుంచి తప్పించుకోవడంతో దుల్కర్ లక్కీ కాదు లక్కీయెస్ట్ ఫెల్లో అని అంతా తనని ప్రశంసల్లో ముంచెత్తుతున్నారు.

# 38 ఏళ్లు తేడా.. ఓకేనా మృణాల్?



యంగ్ హీరోయిన్స్, అప్‌కమింగ్ హీరోయిన్స్ సీనియర్ హీరోలతో నటించేందుకు ఒకింత వెనకడుగు వేస్తున్నారు. స్టార్ హీరోలు అయితే, కథ డిమాండ్ చేస్తే, భారీ పారితోషికం డిమాండ్ చేస్తే తప్ప సీనియర్ హీరోల సినిమాల్లో యంగ్ హీరోయిన్స్ నటించేందుకు ఆసక్తి చూపించడం లేదు. ఇటీవల ఒక తెలుగు స్టార్ హీరోల సినిమాలో ఒక హీరోయిన్ నటించేందుకు గాను ముందు నో చెప్పిందని, కానీ భారీ పారితోషికం ఆఫర్ చేయడంతో ఓకే చెప్పిందనే పుకార్లు షికార్లు చేశాయి. కానీ కొందరు హీరోయిన్స్ మాత్రం ఎంత స్టార్‌డం ఉన్నా కొందరు సీనియర్ హీరోలతో నటించాలని కోరుకుంటూ ఉంటారు. తమ అభిమాన హీరోలు వారు అని, వారితో ఒక్క సినిమా చేసే అవకాశం వచ్చినా చాలని అంటూ ఉంటారు. తాజాగా హీరోయిన్ మృణాల్ ఠాకూర్ ఒక ఇంటర్వ్యూలో అదే తరహా వ్యాఖ్యలు చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ తనకు చిన్నప్పటి నుంచి కమల్ సర్ అంటే చాలా అభిమానం, ఆయన సినిమాలు చాలా చూశాను, చాలా కాలం నుంచి ఆయనతో నటించాలని ఉంది. ఆయన సినిమాలో చిన్న పాత్ర లభించినా చాలు అన్నట్లుగా మృణాల్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. ఈ మధ్య కాలంలో సీనియర్ హీరోలు వయసుతో సంబంధం లేకుండా హీరోయిన్స్‌తో రొమాన్స్ చేస్తున్నారు. ఇటీవల కమల్ హాసన్ థగ్ లైఫ్‌లో చేసిన రొమాన్స్ వివాదాస్పదం అయింది. మీ వయసులో కనీసం సగం కూడా లేని అమ్మాయితో ఇలా రొమాన్స్ చేయడం ఎంత వరకు కరెక్ట్ అంటూ కొందరు ప్రశ్నించారు. ఇదే తరహా ప్రశ్న బాలీవుడ్ సూపర్ స్టార్ ఆమీర్ ఖాన్‌కి సైతం ఎదురు అయింది. కూతురు వయసు ఉన్న అమ్మాయిని మీ సినిమాలో హీరోయిన్‌గా ఎలా నటింపజేస్తారు అంటూ ప్రశ్నించిన వారు చాలా మంది ఉన్నారు. దాని ఆయన స్పందించారు కూడా.. ఏఐ టెక్నాలజీతో తన వయసు తగ్గించారు అన్నట్లుగా చమత్కరించాడు. మొత్తానికి సీనియర్ హీరోలకు హీరోయిన్స్ పెద్ద సమస్యగా ఉన్న సమయంలో మృణాల్ ఠాకూర్ అలా మాట్లాడటం చర్చనీయాంశం అయింది. ప్రస్తుతం కమల్ ఒక భారీ యాక్షన్ సినిమాకు రెడీ అవుతున్నాడు. ఆ సినిమాలో మృణాల్ ఠాకూర్ ను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయని, సీనియర్ హీరోలకు హీరోయిన్స్ లోటు ఉన్న సమయంలో మృణాల్ వంటి స్టార్ హీరోయిన్స్ ఇచ్చిన ఆఫర్‌ను ఏ దర్శకుడు వదిలి పెట్టడు. మృణాల్ చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో రకరకాలుగా ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా కమల్ హాసన్ మీ కంటే 38 ఏళ్లు పెద్దవాడు అనే విషయం మీకు తెలుసు... వయసు తేడా అంతగా ఉందని మీకు తెలిసి కూడా ఆయనతో వర్క్ చేయాలని అనుకుంటున్నారా అంటూ కొందరు నెటిజన్స్ మృణాల్ ఠాకూర్‌ను ప్రశ్నిస్తున్నారు. మృణాల్ అన్ని విషయాలు తెలిసే కమల్‌తో నటించాలని కోరుకుంటూ ఉంటుందని, అభిమానం అనేది వయసును చూడదని, ఆమెకు కమల్ పై ఉన్న అభిమానంతో ఒక్క సీన్‌లో నటించినా చాలు అని వెయిట్ చేస్తుందని, అంతకు మించి వయసు తేడా ఉన్న వారు కూడా జోడీగా నటించిన సందర్భాలు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో చాలా ఉన్నాయి. ఇప్పుడు మృణాల్‌ను తప్పుబట్టడానికి ఏమీ లేదని కొందరు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు.

# ఆ సినిమా గొడవ ఇంకా సద్దుమణగలేదు..!



కమల్ హాసన్, మణిరత్నం కాంబోలో సుదీర్ఘ కాలం తర్వాత వచ్చిన 'థగ్ లైఫ్' సినిమా నిరాశను మిగిల్చింది. వీరిద్దరి కాంబోలో గతంలో వచ్చిన నాయగన్ సినిమా ఎప్పటికి గుర్తుండే రేంజ్‌లో సూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెల్సిందే. నాయగన్ రేంజ్‌లో ఉంటుందని ప్రచారం చేసిన థగ్ లైఫ్ ఫ్లాప్‌గా నిలిచింది. ఇలాంటి మూస తరహా మాఫియా బ్యాక్‌డ్రాప్ సినిమాలు చాలానే వచ్చాయి. ఇలాంటి సినిమాలకు కాలం చెల్లిందని మణిరత్నంతో పాటు కమల్ హాసన్ గుర్తించలేక పోయారు అంటూ రివ్యూవర్స్ తీవ్ర స్థాయిలో విమర్శిస్తూ రివ్యూలు ఇచ్చారు. ఎన్నో ఆశలు పెట్టుకుని, భారీ వసూళ్లు సాధిస్తుందని ఆశించిన థగ్ లైఫ్ సినిమా బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా నిరాశ మిగిల్చింది. సినిమా వచ్చి వారం దాటింది, ఈ సమయంలో సుప్రీం కోర్ట్‌లో ఈ సినిమా కోసం పిటిషన్ దాఖలు అయింది. థగ్ లైఫ్ సినిమా ప్రమోషన్ సమయంలో కమల్ హాసన్ మాట్లాడుతూ కన్నడ భాష అనేది తమిళ భాష నుంచి పుట్టింది అంటూ వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపింది. కన్నడ భాషను అవమానించే విధంగా కమల్ వ్యాఖ్యలు ఉన్నాయంటూ మొత్తం కర్ణాటక లో ఆందోళనలు జరిగాయి. అంతే కాకుండా కన్నడ సినిమా ఇండస్ట్రీ సినిమాను విడుదల కానిచ్చేది లేదని తేల్చి చెప్పడం, కమల్ ఏకంగా కర్ణాటక హైకోర్ట్‌కు వెళ్లడం జరిగింది. అక్కడ కూడా కన్నడ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని అంటున్నప్పుడు క్షమాపణ చెబితే ఏం అవుతుంది అంటూ కమల్‌ను ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. ఆ సమయంలో సినిమాను కర్ణాటకలో విడుదల చేయకున్నా పరవాలేదు కానీ నేను మాత్రం క్షమాపణ చెప్పను అంటూ కమల్ భీష్మించుకు కూర్చున్నారు. సినిమా కర్ణాటకలో విడుదల కాలేదు. అక్కడ తప్ప దేశ వ్యాప్తంగా విడుదల అయింది. ఇతర భాషల్లో విడుదల అయిన థగ్ లైఫ్ పెద్దగా ఆడింది ఏమీ లేదు. తమిళనాట ఒక మోస్తరు వసూళ్లు నమోదు అయ్యాయి. కన్నడంలో విడుదల అయినా కూడా అదే ఫలితం అక్కడ రిపీట్ అయ్యి ఉండేది. అక్కడి ప్రేక్షకులు కూడా ఇప్పుడు థగ్ లైఫ్ సినిమాను థియేటర్‌లో మిస్ అయ్యాం అనే ఫీల్‌తో లేరు. ఇలాంటి సమయంలో మహేష్ రెడ్డి అనే వ్యక్తి థగ్ లైఫ్ సినిమాను కర్ణాటకలో అనధికారికంగా బ్యాన్ చేశారు అంటూ సుప్రీం కోర్ట్‌లో పిటీషన్ వేశాడు. సినిమా విడుదలను అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవడంలో అక్కడి ప్రభుత్వం విఫలం అయింది అంటూ ఆయన తన పిటీషన్‌లో పేర్కొన్నాడు. అంతే కాకుండా వాక్ స్వాతంత్ర్యం కు భంగం వాటిల్లింది, వృత్తిని కించ పరిచే విధంగా అక్కడ చర్యలు జరిగాయని పిటీషన్‌లో తెలియజేయడం జరిగింది. పిటీషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీం కోర్ట్ ధర్మాసనం ముందుగా కర్ణాటక సర్కార్‌కు నోటీసులు జారీ చేసింది. ఎందుకు థగ్ లైఫ్ సినిమా విడుదలకు సహకరించలేదు అంటూ ప్రశ్నించింది. అంతే కాకుండా అక్కడి సినిమా ఇండస్ట్రీకి చెందిన వారిని సైతం ఈ పిటీషన్‌లో విచారించే అవకాశాలు ఉన్నాయి. సినిమా విడుదల అయ్యింది.. ఆశించిన స్థాయిలో ఆడలేదు. అయినా కూడా కర్ణాటకలో విడుదల కాకపోవడం అనేది చట్ట ప్రకారం కరెక్ట్ కాదనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. అందుకే సుప్రీం కోర్ట్‌లో ఈ సినిమా కోసం పిటిషన్ వేసి ఉంటారు. ఈ పిటిషన్ విచారణ జూన్ 17 కు సుప్రీం వాయిదా వేసింది. కమల్ హాసన్‌తో పాటు ఈ సినిమాలో శింబు ముఖ్య పాత్రలో నటించాడు. త్రిష, అభిరామి, ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్స్‌గా నటించిన విషయం తెల్సిందే. కమల్, మణిరత్నం కలిసి నిర్మించిన ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందించారు.

# ఆ స్టార్ చేతుల మీదుగా కన్నప్ప ట్రైలర్.. గ్రాండ్ ప్రమోషన్‌తో డబుల్ బజ్




టాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ కన్నప్ప సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించగా, మోహన్ బాబు నిర్మిస్తున్నారు. బాలీవుడ్ సూపర్ స్టార్ అక్షయ్ కుమార్, రొమాంటిక్ క్వీన్ కాజల్ అగర్వాల్, పాన్ ఇండియా హీరో ప్రభాస్, మలయాళ మెగాస్టార్ మోహన్ లాల్ వంటి స్టార్ క్యాస్టింగ్‌తో ఈ సినిమా ఇప్పటికే ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయింది. ఇక ప్రీతి ముకుందన్ కథానాయికగా నటిస్తున్నారు. విష్ణు కెరీర్‌లో ఇదే అతిపెద్ద బడ్జెట్ చిత్రంగా నిలవనుంది. ఇప్పటికే ఫస్ట్ గ్లింప్స్, పోస్టర్లు సినిమాపై అంచనాలు పెంచగా, ఇప్పుడు మేకర్స్ ట్రైలర్ రిలీజ్ కు సిద్ధమయ్యారు. ఈ రోజు సాయంత్రం కన్నప్ప ట్రైలర్‌ను గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ప్రత్యేకంగా కొచ్చి నగరాన్ని ఈ వేడుక కోసం ఎంపిక చేశారు. అంతేకాదు, ఈ ట్రైలర్‌ను లాంఛనంగా విడుదల చేస్తున్నది మరెవరో కాదు.. మలయాళ మాస్ కింగ్ మోహన్ లాల్. ఆయన ఈ ఈవెంట్‌కు ప్రత్యేక అతిథిగా హాజరవుతుండటంతో ఈ వేడుకపై మరింత ఆసక్తి నెలకొంది. ఇక ట్రైలర్ డ్యూరేషన్ 2 నిమిషాల 50 సెకన్లుగా ఉండనుంది. ఇండస్ట్రీలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం ట్రైలర్ విజువల్స్, విజువల్ ఎఫెక్ట్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అన్నీ చాలా గ్రాండ్‌గా ఉన్నాయని టాక్. ప్రత్యేకంగా కన్నప్ప చూపించిన అఖండ విశ్వాసాన్ని శక్తివంతంగా చూపించారని తెలుస్తోంది. ఇందులో విష్ణు పోషిస్తున్న క్యారెక్టర్ ఎమోషనల్‌గా, పవర్‌ఫుల్‌గా నిలిచేలా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రభాస్, అక్షయ్ లుక్‌లు కూడా ట్రైలర్‌లోనే సర్ప్రైజ్‌గా చూపించబోతున్నారని టాక్. ఇప్పటికే ఓవర్సీస్‌లో ప్రమోషన్స్ ముగించిన మేకర్స్, ప్రస్తుతం దేశ వ్యాప్తంగా కన్నప్ప ప్రమోషన్స్‌ను దూకుడుగా నిర్వహిస్తున్నారు. ముంబయి, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో పలు ఇంటర్వ్యూలు, ప్రెస్ మీట్లతో హైప్‌ను పెంచుతున్నారు. ఈ ట్రైలర్ రిలీజ్ తర్వాత బజ్ రెట్టింపు అవుతుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. మైథలాజికల్ డ్రామా అయినా కూడా యంగ్ ఆడియెన్స్‌కు కనెక్ట్ అయ్యేలా ఈ సినిమా రూపొందిందని మంచు విష్ణు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పిన సంగతి తెలిసిందే. జూన్ 27న వరల్డ్ వైడ్‌గా విడుదల కానున్న కన్నప్ప సినిమా ఎలాంటి రికార్డులను క్రియేట్ చేస్తుందో చూడాలి.

# ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ చూపిన ఆణిముత్యాలకు బహుమతుల ప్రదానం

## - ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నేను అండగా ఉంటానని భరోసా కల్పించిన శాసనసభ్యులు కృష్ణప్రసాదు

## - షైనింగ్ స్టార్స్-2025 పేరిట విద్యార్థులను ఘనంగా సత్కరించి, స్వచ్ఛందంగా స్వంత నిధులతో నగదు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు - మొత్తం 130 మందికి రూ.7.40 లక్షలు అందజేత

**ఎన్టీఆర్ జిల్లా, మైలవరం, (రాజధాని వార్తలు):** 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులను గౌరవ మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు ఘనంగా సత్కరించి, మొత్తం 130 మందికి రూ.7.40 లక్షల ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. తమ చదువుల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించి ప్రతిభ చూపిన సుమారు 120 మంది విద్యార్థిని, విద్యార్థులను సన్మానించి నగదు బహుమతులను అందజేశారు. పదవ తరగతిలో పాఠశాల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన 112 మందికి రూ.5 వేలు చొప్పున రూ.5.60 లక్షలు, నియోజకవర్గ స్థాయిలో టెన్త్‌లో మొదటి స్థానాల్లో నిలిచిన ముగ్గురికి రూ.10 వేలు చొప్పున రూ. 30 వేలు, ఇంటర్మీడియట్లో నియోజకవర్గంలో ఐదు మండలాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన 15 మందికి రూ.10 వేలు చొప్పున రూ.1.50 లక్షలు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. తొలుత విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు స్వయంగా అల్పాహారాన్ని వడ్డించి, వారితో ముచ్చటిస్తూ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు అల్పాహారాన్ని ఆరగించారు. మైలవరంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం కల్యాణ మండపం వేదికగా శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులకు తన ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందన్నారు. ప్రతిభకు పేదరికం ఎప్పుడూ అడ్డు కాదన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం కూడా ముఖ్యమన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాల విద్యార్థినే అంటూ, ప్రభుత్వ పాఠశాలల నుండే ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఎందరో గొప్పవాళ్ళు వచ్చారంటూ విద్యార్థిని, విద్యార్థులకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు స్ఫూర్తినిచ్చారు. ప్రతి విద్యార్థి టాప్ ర్యాంకులను, మార్కులను సాధించడంతో పాటు వారి నైపుణ్యాన్ని కూడా మెరుగుపరచుకుని దానికి అనుగుణంగా సృజనాత్మకతను పెంపొందించుకుంటూ వారు ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యార్థులు ఎప్పుడు సానుకూల దృక్పథం కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలన్నారు. సమాజంలో మంచి, చెడుల పట్ల విచక్షణ కలిగి ఉండాలన్నారు. మనదేశంలో సాధారణ స్థాయి నుంచి అత్యంత శిఖరాలకు ఎదిగిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఒక చిన్న కుగ్రామం నుంచి వచ్చి ఎదిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థిని, విద్యార్థులు చదువుకోటానికి తల్లిదండ్రులు కూడా ఇంటి వద్ద ఆహ్లాదకరమైన మంచి వాతావరణం కల్పించాలన్నారు. విద్యార్థులు కూడా అరచేతిలో అమరిపోతున్న సమాచార వ్యవస్థ సెల్ ఫోన్ టెక్నాలజీని కూడా విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి వినియోగించాలి తప్ప, ఇతరత్రా వ్యాపకాలపై దృష్టి పెట్టకూడదన్నారు. దీనిపై తల్లిదండ్రులు కూడా వారి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆర్థిక స్థితిగతులు బాగా లేదంటూ ఎమ్మెల్యే ముందు కంటతడి పెట్టిన పలువురు విద్యార్థిని, విద్యార్థులల సమస్యలపై ఎమ్మెల్యే తానున్నానంటూ భరోసా కల్పించారు. ప్రతిభ చూపితే తన ప్రోత్సాహకాలు ఎప్పుడూ ఉంటాయని తక్షణమే పలువురిని విద్యా అవసరాల నిమిత్తం దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. విద్యార్థులకు ఉచిత విద్య, స్కూల్ కిట్, బుక్స్, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనంతో పాటు వారి సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం దూరదృష్టితో ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిందన్నారు. మైలవరం నియోజకవర్గంలో దాదాపు 38,800 మంది విద్యార్థిని, విద్యార్థులకు సుమారు రూ.50 కోట్ల రూపాయలను జమచేసినట్లు వెల్లడించారు. తల్లికి వందనం నగదును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.










**ఎమ్మెల్యే షైనింగ్ స్టార్స్ - 2025 కార్యక్రమంలో నవ్వులు పూయించిన బుడతడు**

ఎ.కొండూరుకు చెందిన కొప్పుల దుర్గా ప్రసాద్ రెడ్డిగూడెం మండలం కుదప ప్రభుత్వ హైస్కూలులో 10వ తరగతి చదివి ప్రతిభ చూపడంతో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు షైనింగ్ స్టార్స్ కార్యక్రమానికి ఆహ్వానించబడ్డాడు.

తన అభిప్రాయాలను చెబుతూ తాను ఉదయాన్నే ఇంటింటికి తిరిగి పేపర్ వేస్తానని, ప్రతి రోజు స్కూల్‌కి లేటైతే టీచర్ కోప్పడేవారని, తాను స్కూల్‌కి వెళ్ళే టైమ్‌కి బస్ లేక రోజూ లిఫ్ట్ అడిగి స్కూల్‌కి వెళ్ళేవాడినని, మళ్ళీ స్కూల్ అయిపోయాక లిఫ్ట్ అడిగి ఇంటికి వెళ్ళేవాడినని చెప్పడంతో సభ అంతా నవ్వులతో నిండిపోయింది. పాలిటెక్నిక్ చదువుతున్న దుర్గాప్రసాద్ వయసు ఎంత అని అడగడంతో 16 ఏళ్ళు అని చెప్పాడు దుర్గా ప్రసాద్, లైసెన్స్ రాదు కాబట్టి రోజూ తిరువూరు వెళ్ళడానికి బస్ పాస్ కావాలా అని అడిగితే బుడతడు సైకిల్ అడగడంతో సైకిల్ కొని ఇస్తానని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు హామీ ఇచ్చారు. కార్యక్రమం ముగిసే సమయానికి సైకిల్ తెప్పించి విద్యార్థి దుర్గాప్రసాదుకు ఎమ్మెల్యే కృష్ణప్రసాదు అందజేశారు.

# యల్.బి.ఆర్.సి.ఈ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**మైలవరం, (రాజధాని వార్తలు):** స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ది. 14-06-2025న మూడవ గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యాకమానికి ప్రొఫెసర్ కె.వి. రమణ, రెక్టార్, జె.యన్.టి.యు, కాకినాడ ముఖ్య అతిధిగా వ్యవహరించారు. సుప్రియ దేవిదుత్త, గ్లోబల్ డెలివరీ లీడర్ అండ్ ఏఐ ప్రాక్టీస్ లీడర్, ఐబిఎం, బెంగుళూర్ వారు గౌరవ అతిధిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె.వి.రమణ గారు గ్రాడ్యుయేషన్ డేను ప్రారంభించి, తన అధ్యక్ష ప్రసంగంలో గ్రాడ్యుయేట్‌లను అభినందించారు. లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యలో ఉన్నత ప్రమాణాలను కొనసాగిస్తోందని మరియు యువ గ్రాడ్యుయేట్‌లను సమాజానికి రూపొందించడంలో సహాయపడుతుందని తెలిపారు. ఏ కోర్స్ చదివిన దానిలో జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, కృషి, పట్టుదలతో ఆయా రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు మరియు విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక వెలికి తీయడం కోసం కృషి చేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను కళాశాల ప్రిన్సిపాల్‌ను అభినందించారు. గౌరవ అతిధి సుప్రియ దేవిదుత్త ప్రసంగిస్తూ ఏఐ సమాజంలోని అన్ని ఉద్యోగ మార్కెట్‌లను ఆక్రమించుకుంటున్నందున, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి మరియు మీరు ఏ శాఖ లేదా సాంకేతికతను అనుసరిస్తున్నారో దానితో సంబంధం లేకుండా ఏఐతో మీ ప్రయాణాన్ని ప్రారంభించాలని మరియు వ్యవస్థాపకత, వ్యాపారం మరియు సాంకేతిక ఆవిష్కరణలను అనుసరించమని ఆయన ప్రోత్సహించారు. కళాశాల చైర్మన్ లకిరెడ్డి ప్రసాద్ రెడ్డి ప్రసంగిస్తూ గ్రాడ్యుయేట్‌లను దేశానికి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి, అంకితభావంతో అభ్యసనం నిరంతర ప్రక్రియ అని సూచించారు. విలువలతో కూడిన విద్య ద్వారానే సమాజానికి మేలు జరుగుతుందని తెలిపారు. కళాశాల కో ఫౌండర్ మరియు హానరరీ చైర్మన్ లకిరెడ్డి జయ ప్రకాష్ రెడ్డి ఆన్ లైన్‌లో మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులను అభినందిస్తూ ఆయా రంగాలలో లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు. కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఈ వేడుకలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ డేటా సైన్స్, ఏరోస్పేస్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు మెకానికల్ ఇంజనీరింగ్ వంటి వివిధ శాఖలకు చెందిన 847 మంది విద్యార్థులు పట్టాలు అందుకున్నారని, అందులో 9 మందికి గోల్డ్ మెడల్స్‌ను, 10 మందికి సిల్వర్ మెడల్స్‌ను మరియు కళాశాల టాపర్ అనుమోలు అమృత, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థిని లకిరెడ్డి బాలిరెడ్డి గోల్డ్ మెడల్ మరియు 25000 నగదు బహుమతిని జె.యన్.టి.యు రెక్టార్ ప్రొఫెసర్ కె.వి.రమణ చేతుల మీదుగా బహుకరించారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను (విద్యార్థులను) ప్రొఫెషనల్‌గా తీర్చిదిద్దడంలో కృషి చేసినందుకు అధ్యాపకులకు మరియు యాజమాన్యానికి సంతోషకరమైన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు గ్రాడ్యుయేషన్ డేను ముగించినట్లు కృతజ్ఞతలు తెలుపుతూ జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి, డీన్స్, ట్రస్ట్ బోర్డు మెంబర్స్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.






# 21న ఛలో వైజాగ్...యోగా గిన్నిస్ రికార్డులో భాగస్వామ్యం కండి - ప్రజలకు ఎమ్మెల్యే ఎన్ఇఆర్ పిలుపు



**రణస్థలం, (రాజధాని వార్తలు):** రణస్థలం మండల కేంద్రం ఎంపీడీఓ ఆఫీస్ ప్రాంగణంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో అధికారులు, నాయకులు హాజరైన కార్యక్రమంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ హాజరవుతున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతం చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో భాగస్వామ్యం కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

# తుని నియోజకవర్గం లోకల్ ఎన్నికలు పరిశీలకులుగా పెద్దిరెడ్డి చిట్టిబాబు

**పాయకరావుపేట, (రాజధాని వార్తలు):** తుని నియోజవర్గం లోకల్ ఎన్నికలు పరిశీలకులు గా పెద్దిరెడ్డి చిట్టిబాబు నియమితులయ్యారు ఈ సందర్భంగా పొలిటి బ్యూరో సభ్యులు రామకృష్ణని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో చింతకాయల రాంబాబు వేములపూడి అప్పారావు, కట్ట శీను, తదితరులు పాల్గొన్నారు.



# విడిచిన మాట.. తట్టిన నిరసన

## - సంపూర్ణ అమలు కోరుతూ ఎస్ఎఫ్ఐ నేతల నిరసన కార్యక్రమం

**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** తల్లికి వందనం పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి జీవన్ కృష్ణ డిమాండ్ చేశారు. చదువుతున్న ప్రతి విద్యార్థిని ఖాతాలో షరతుల్లేకుండా రూ.15,000 జమ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం కేవలం రూ.13,000 మాత్రమే జమ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు చింతపల్లి మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. 15 వేల పథకాన్ని కట్ చేసి 13 వేలు జమ చేయడం న్యాయమా? అని ప్రశ్నించారు. నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడం బాధాకరమన్నారు. విద్యార్థుల హక్కులకు అన్యాయం జరుగుతోందని, తక్షణమే పూర్తి మొత్తాన్ని జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జీవన్ కృష్ణతో పాటు మండల ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# దేమునిగుమ్మం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న పప్పల చలపతిరావు

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** మాజీ శాసనసభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ మాజీ శాసన మండల సభ్యులు పప్పల చలపతిరావు సతీ సమేతంగా అనకాపల్లి వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు ఈవో మురళీకృష్ణ స్వాగతం పలికి దేవాలయం అర్చకులు పులకండం గిరిబాబు, పులకండం ప్రసాద్, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవాలయం చైర్మన్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గోలి మురళి, కొణతాల అరుణ, వాసు, తదితరులు పాల్గొన్నారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan